




# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్












## 19న 'బల్దియా'లో ప్రజావాణి లేదు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : బల్దియా ప్రధాన కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 10 .30 గంటలకు జరిగే ప్రజావాణి కార్యక్రమం ఉండదని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం జనరల్ బాడీ సమావేశం ఉన్న నేపథ్యంలో ప్రజావాణి, కమిషనర్ ఫోన్ ఇన్ కార్యక్రమం ఉండవన్నారు. అయితే సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో ప్రజావాణి యధావిధిగా ఉంటుందన్నారు.

## స్వీపింగ్ యంత్రాల పనితీరు, బిల్లుల చెల్లింపులపై నజర్

### నివేదిక ఇవ్వాలంటూ కమిషనర్ ఆదేశం

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పారిశుధ్య నిర్వహణలో స్వీపింగ్ యంత్రాల వినియోగంలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కమిషనర్ రోనాల్డ్ రాస్ దృష్టి సారించారు. సీఆర్ఎంపీ రోడ్లలో స్వీపింగ్ యంత్రాలను వినియోగిస్తుండడం, ఫ్లై ఓవర్లు, ఇతర ప్రాంతాల్లో మాత్రం కార్మికులతో పనిచేయించడం, వర్షాలు కురిసిన సమయంలోనూ ఏజెన్సీలకు బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో స్వీపింగ్ యంత్రాల వినియోగం, బిల్లుల చెల్లింపుల విధానంపై నివేదిక ఇవ్వాలని సంబంధిత విభాగం అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విచారణ అధికారులు రంగంలోకి దిగడంతో ఏ విధమైన అక్రమాలు బయటపడతాయోనన్న భయాందోళనలో సంబంధిత విభాగం అధికారులు ఉన్నారు. అయితే శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్‌రెడ్డి వ్యవహారం ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది.

## కుల గణన తీర్మానం ఆమోదంపై హర్షం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) /ఉస్మానియా యూనివర్సిటీ: సమగ్ర కుల గణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించడంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

## బ్యాంకుల ప్రతినిధులతో సమావేశానికి సన్నాహాలు

సిటీబ్యూరో: సైబర్‌నేరాలను కట్టడి చేయడంలో భాగంగా హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు విశ్లేషించిన 8 వేల బ్యాంకు ఖాతాల ద్వారా సేకరించిన సమాచారంపై బ్యాంకింగ్ అధికారులు, యూపీఐ పేమెంట్ ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఖాతాల విశ్లేషణలో సేకరించిన లోపాలను సరిదిద్దుతూ తప్పని సరిగా చేయాల్సిన పలు అంశాలపై చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ నేతలు

## మా ఆత్మహత్యలు కనిపించడం లేదా?

# సీఎం రేవంత్.. నీ వైఖరి మార్చుకో

### కదంతొక్కిన ఆటోడ్రైవర్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 ( నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ నిరంకుశ విధానాలు నశించాలి.. డ్రైవరన్నల ఆత్మహత్యలపై స్పందించాలి.. ఉచిత బస్సు స్కీంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేలు చెల్లించాలి. ప్రభుత్వం స్పందించకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమియే ఎజెండాగా పనిచేస్తాం.. మా ఆత్మహత్యలు కనిపించడం లేదా? సీఎం రేవంత్ రెడ్డి నీ వైఖరి మార్చుకో' అంటూ నినదిస్తూ.. ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆటో బంద్ విజయవంతమైంది. అందులో భాగంగా నగరంలో బీఆర్‌టీయూ , ఏఐటీయూసీ, టీఏటీయూ, సీఐటీయూ, ఏఐటీసీ తదితర సంఘాలతో కూడిన ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డ్రైవర్లు భారీ ర్యాలీ తీశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. తమను అన్ని విధాలా మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. 'ఆటో డ్రైవర్లను ఆదుకోండి' అంటూ ప్ల కార్డులను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఒక్కసారిగా ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అనంతరం టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఉచిత బస్సు స్కీంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మందికిపైగా డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నా.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఏఐటీయూసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల బతుకులు కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. అటు కేంద్రం హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదని, కేంద్రం నల్ల చట్టాలతో రవాణా రంగ కార్మికులపై ఉక్కుపాదం మోపుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీసీ ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, టీఏటీయూ ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పోలే నిరంజన్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, హైమద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

> నెలకు రూ.15వేలు చెల్లించాలి
> స్పందించకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం
> 'హిట్ అండ్ రన్' చట్టంతో భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్రం
> ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డ్రైవరన్నల నిరసన ర్యాలీ
> కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం



బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో టీఏటీయూ నేతల నిరసన

## ఎల్లుండితో బుక్ ఫెయిర్ ఆఖరు

సిటీబ్యూరో, ఫిబ్రవరి16 ( నమస్తే తెలంగాణ ) : ఎల్లుండితో బుక్ ఫెయిర్ ముగియనున్నది. ఇప్పటికే పుస్తక ప్రేమికులు ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన పుస్తక ప్రదర్శనలో వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తూ సందడి చేస్తున్నారు. శుక్రవారం రవ్వా శ్రీహరి వేదికపై పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. 'యువతరం కవులు అంతరంగ ఆవిష్కరణ' అంశంపై నేటితరం యువ కవులతో చర్చా కార్యక్రమం జరిగింది. జీవితం లేకుండా కవిత్వం లేదని కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల ద్వారా యువతరం, నవతరం కవులు గళమెత్తాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసేన్, గౌరీ శంకర్, కవి యాకూబ్, నారాయణరెడ్డి, చరణ్, రాము, కల్యాణి, శ్రీనిధి విప్లవ శ్రీ, అనూష తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాల వికాస్ కార్యక్రమంలో భాగంగా చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాటలు, పద్యాల పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం మిస్టర్ చోగా పేరుగాంచిన ప్రముఖ బాల సాహితీవేత్త చొక్కాపు వెంకట రమణ ప్రదర్శించిన ఫన్నీ మ్యాజిక్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ ప్రదానం చేశారు.

## జీతాలివ్వండి సారూ!

కొండాపూర్, ఫిబ్రవరి 16 : నెలలు గడుస్తున్నా.. జీతాలిస్తలేరంటూ.. శుక్రవారం కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ విభాగం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. డిసెంబర్, జనవరి వరకు జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. కొంతకాలంగా కాంట్రాక్టర్ల ఆగడాలు ఎక్కువయ్యాయని, ఉద్యోగులకు ఉండే సీఎల్‌లను సైతం వినియోగించుకోకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. జీతాలిచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఆందోళనలో సిబ్బంది శ్రవణ్ యాదవ్, రాజు, భాగ్య, మల్లేశ్వరి, అనిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా దవాఖానలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## ₹354 కోట్లతో బుద్వేల్ లేఅవుట్

సిటీబ్యూరో: బుద్వేల్‌లో హెచ్ఎండీఏ చేపట్టిన లే అవుట్ అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచారు. సుమారు 182 ఎకరాల ప్రభుత్వ భూమిని లే అవుట్ చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ లే అవుట్ అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. సుమారు రూ. 354 కోట్ల వ్యయంతో లే అవుట్‌లో విశాలమైన రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. మోకిలలో హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తున్న మరో లే అవుట్‌లోనూ మౌలిక వసతుల కల్పన కోసం రూ. 47 కోట్లను వెచ్చించనున్నారు.






### నేడు గ్రేటర్ వ్యాప్తంగా..

## కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం గ్రేటర్ వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మాగంటి గోపీనాథ్ తెలిపారు. వేడుకలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. కాగా, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, శ్రేణులు, అభిమానులు పలు ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించనున్నారు. వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు లక్ష రూపాయల కవరేజీ వచ్చే విధంగా మొత్తం 10 కోట్ల రూపాయల విలువైన ప్రమాద, ఆరోగ్య బీమా పత్రాలు, దివ్యాంగులకు వీల్‌చైర్స్, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్ రాజకీయ ప్రస్థానం, ఉద్యమ నేపథ్యంలో 30 నిమిషాల వ్యవధితో కూడిన 'తానే ఒక చరిత్ర' పేరుతో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ఈ వేడుకల సందర్భంగా ప్రదర్శించనున్నారు.

## కరెంట్ షాక్ తప్పదా?

### అరకొర చర్యలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): వేసవి ఆరంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండల తీవ్రత పెరిగే కొద్దీ కరెంటు వినియోగం గణనీయంగా పెరుగుతున్నది. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పేరుతో ఈనెల 10 వరకు చెట్ల నరికివేతకే పరిమితమయ్యారు. వేసవిలో డిమాండుకు అనుగుణంగా నిరంతర నాణ్యమైన విద్యుత్ కోసం ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు కొత్త లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ వేసవికి ముందుగానే ఏర్పాటు చేయకపోతే గ్రేటర్‌కు వేసవిలో విద్యుత్ షాక్ తప్పని పరిస్థితి ఉన్నది. పెరుగుతున్న విద్యుత్ డిమాండుకు అనుగుణంగా కార్యాచరణ లేకపోవడంతో సరఫరాలో అంతరాయాలు వినియోగదారులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

### సీఎండీ సమీక్ష..

ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచే చలి తీవ్రత తగ్గి.. ఎండలు క్రమంగా ప్రారంభమయ్యాయి. అయితే విద్యుత్ డిమాండుకు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల కేపాసిటీ పెంచడం వంటి చర్యలు చేపట్టేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎండీ నుంచి మొదలు కొని డైరెక్టర్ల వరకు అందరూ మారడం.. ప్రభుత్వ హామీల్లో ఒకటైన ఉచిత విద్యుత్ పథకం అమలుపైనే అధికార యంత్రాంగమంతా దృష్టి సారించి పనిచేయడం వల్ల కూడా వేసవి కార్యాచరణపై దృష్టి పెట్టలేదు. ఇప్పటికే ఈ ప్రక్రియ ఆలస్యమవ్వగా.. టీఎస్ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం డిస్కం పరిధిలోని డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్ఈలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వేసవి కార్యాచరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.

### 1500 ట్రాన్స్ ఫార్మర్లు అవసరం...

వేసవిలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలంటే ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా సుమారు 1500 ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. సబ్ స్టేషన్లలో సుమారు 45 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తగా 450 కి.మీ మేర విద్యుత్ లైన్లు అవసరం. సింహభాగం విద్యుత్ వినియోగం సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్, హబ్సిగూడలో ఉంది. బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్‌లలో తక్కువ డిమాండు ఉంటుందని అధికారులు గుర్తించారు. ఇందుకు అనుగుణంగానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లను ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఏర్పాటు చేయాలి. వేసవి డిమాండుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటే సుమారు సుమారు రూ. 500 కోట్లకు పైనే వ్యయమవుతుందని అంచనా. ఇలా వేసవి కాలమైన మార్చి, ఏప్రిల్-మే నాటికి అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలంటే ముందుగానే అన్ని రకాల సామగ్రిని సిద్ధం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.




'యువతరం కవులు అంతరంగ ఆవిష్కరణ' చర్చా కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరిశంకర్, యువ కవులు